# "బాలముత్తయిదువులింకా ఉన్నరు"

పదేండ్ల కిందనుకుంట....మా ఊళ్ళె బస్సెక్కి కరీంనగర్ పోతన్న. మా ఊరుకు రొండు కిలోమటర్లకంటె తక్కోదూరంలోనే చీమలపాటని చిన్న ఊరుంది. గా ఊరు మా ఊరు పంచాయితి కిందనే ఉంది. ఆ చిన్నూల్లె రొండు పల్లెలున్నయి. ఒక్క పల్లెనేమో తెనుగుపల్లంటరు. గక్కడెక్కోమంది తెనుగు కూలపోల్లే ఉన్నరు. అల్లు సాపలు పట్టుకుంట ఏకాలంల దొరికన పండ్లాకాలంల అమ్ముకుంట, ఎవుసం జేసుకుంట బతుకుతరు. ఇంకో పల్లెను కురుమ పల్లంటరు. అక్కడెక్కోమంది కురుమోల్లే ఉన్నరు. అల్లు గొర్లగాసుకుంట, గొర్లకు డాకులేసుకుంట,[30] గొంగల్లు నేసుకుంట, ఎవుసంజేసుకుంట బతుకుతరు. నా సిన్నప్పటికెల్లి సూత్తన్న అల్లు మీదికి గట్టిన ఎర్రంచు దొడ్డుధోతుల్తోని నెత్తిమీద ఇంతెత్తు రుమాల్లతోని మురికి మురికిగుంటరు. చేతిలకట్టె, బుజమీద్మీన గొంగడెక్కడకిపెయినా ఉంటయి. ఆడోల్లకాళ్ళకు సవశేరంత గీపెండి కడాలు, సేతులకు కడాలు, నడుముకు వెండి ఒడ్డాలముంటయి. ముక్కుకు ముక్కుకంటెలు పుదిముక్కెర, మెడల నల్లపూసల గుండ్లుంటయి. అల్లమాటదో తీరు యాసుంటది. వాళ్ళిండ్లల్ల గొంగల్లునేసే సింతగింజలంబలాసన, ఇంటిచుట్టు పెంట, మురికితోనుండి గలీజుగుంటది. ఈగలు, దోమలు శాశ్వితంగ ఇండ్లపొంటుంటయి. బస్సుల నేనక్కడికి రాంగనే సిన్నప్పటికెల్లి జూసిన బతుకులు కనిపిస్తయి.

బస్సు కురుమపల్లె టేజికాడాగింది. రోడ్డు పక్కపొంటి ఇరువైమందిదాక ఆడోల్లు, మొగోల్లున్నరు. ఓ ఏడెనిమిదేండ్ల సిన్నపిల్ల ఒళ్ళె గట్టుకోనుంది. ఆ పిల్ల మెడల నల్లపూసల దండ, గంటె పుత్తెలున్నయి. కాల్లదిక్కు సూత్తె మట్టెలు గనిపిచ్చినయి. ఆ పొల్లం జూసి లగ్గమయిందని అరుతం జేసుకున్న. పసుపుబట్టల్తో నున్న ఆ పొల్లెందుకో ఏడుత్తంది. ఆ పొల్ల తల్లిగావచ్చు బుదురకిచ్చుకుంట బస్సెక్కియ్యన్నని సూత్తంది. బస్సు మెట్లకాడికి గుంజుకచ్చినా వత్తలేదా పొల్ల.

"నేన్రాను పో" అనేడుత్తందా పొల్ల.

"లగ్గం జేసుకున్నంక అత్తగారింటికి పోకుంటెట్ల బిడ్డ?" అని బుదురకిత్తంది తల్లి.

"అం.........నేంబోను పో. అవ్వా నేంబోనే. అస్సలే పోనే" అని అటంబెట్టుకుంట ఏడుత్తందా పొల్ల.

"పోర్ని రొండు సరిసి బస్సెక్కియ్యి" అన్న డక్కన్నే ఉన్న తండ్రి.

తండ్రి గద్దరియ్యాంగనే రాగం దీసుకుంట ఏడ్పుడు పెట్టిందా పిల్ల.

"అగు నువ్వాగు. పసిపోర్ని గద్దరిత్తె పోతదా? బుదురకిచ్చి తోలాలెగని" మొగన్తోనని" బస్సెక్కు బిడ్డ" అని బస్సు తంతెలకాడికి తీసుకచ్చింది.

ఎంత సముదాయించినా ఆ పిల్ల బస్సెక్కుతలేదు.

"పున్నంకచ్చి" నేం దీసుకత్త పో బిడ్డ" పున్నమింకెన్ని రోజులుంది? మాంటె పద్దినాలేనాయె. పో బిడ్డ పో. మీ అత్త మంచిది. నీకు సాతనయిన పన్జెయ్యి. లేకుంటె లేదు. నిన్నేమనది" అని గద్దువ పట్టుకుందాల్లవ్వ.

"నేం బోనంటె పోను. నాకు బయమయితంది పో" అని బస్సుకు దూరంగ పోబోయిందా పిల్ల. తల్లాగవట్టి తంతెలకాడికి గుంజుకచ్చింది.

"మీ అత్తగారింటికి పక్కపొంటె మన మల్లక్కిల్లుందిగాదు బిడ్డ! రోజుక్కొంతసేపు మల్లక్కంటికాడ పొయ్యి కూసో. నిన్నెవ్వలద్దంటంద్రు. ఏమన్న కొన్కుక్కో. ఇగవటు పైసలు" అని ఐదు రూపాయలా పిల్ల కొంగుగ్గట్టింది.

"నాకు పైసలద్దేమద్దుపో. నాతోనెవ్వలన్నత్తెనే నేంబోత".

"మీ అత్తగారింటికి నీతోనెవ్వలత్తరు బిడ్డ! గట్లుంటదా ఎక్కన్నన్న? రొండుద్దలయినంక మీ నాయిన్నందోలుత. నిన్ను చూసత్తడు. అటెనుకెనిమిది దినాలకు నేనచ్చి తీసుకత్త. తెల్లరవట్టె, పొద్దుగూకవట్టె ఎంతల గడుత్తయి బిడ్డ గీ పద్దినాలు" అని చెయ్యివట్టి లేపి బస్సెక్కిచ్చేటందుకు తిప్పల పండుతుందా పిల్ల తల్లి. కానాపిల్ల బస్సెక్కుతలేదు గింజుకుంటంది.

మంచిల్దాగుటానికి కిందికి దిగిన కండక్టరు బస్సెక్కిండు.

"ఏందిది? ఇదేమన్న మీ సంత బస్సనుకుంటంద్రా? ఎంతసేపు బుదురకిచ్చుడు. రైట్ రైట్ బస్సు వోతంది. ఎక్కుతెక్కంఙ్రి. లేకుంటె లేదు" అన్నడు రాడ్‌మీన పంచ్‌తోని రొండు గొట్టిండు.

"అట్లాగుంఙ్రి బాంచెను. కొద్దిగంతాగుంఙ్రి' అని బలవంతంగ ఆ పిల్ల తల్లి బిడ్డను బస్సెక్కిచ్చింది.

"పోయిరా బిడ్డ పోయిరా అక్కడేద్వకు" బిడ్డకు జెప్పి, "అదినే నా బిడ్డెను నీ బిడ్డోలె జూసుకో. పసిపోరి. తెలవకేమన్న తప్పుసేసినా ఓపికవట్టు. నేనుంటిగ" అని బస్సు దిగింది.

కండక్టరు మల్లోసారి రైటనంగనే బస్సు కదిలింది. నా వెనుకున్నసీట్ల ఆ పిల్ల, అత్త కూసున్నరు. ఆ పిల్ల కొంచెం సేపయినంక ఏడ్వాపి కిటికీలకెల్లి బయటికి సూత్తంది. నా పక్కపొంటి సీట్ల నన్ను బావా అని పిలిసె జగ్గయ్య కూసున్నడు. అయనది కుర్మపల్లె.

"ఏడెనిమిదేండ్లన్న లేపాయె. గా పసిపొల్లకెందుకు లగ్గం జేసుడోయ్ జగ్గయ్యా! ఈ పొల్ల అత్తగారింటికి పొయ్యేం జేత్తది?" అన్న నేను.

"ఏం జేసుడు బావ! మా కురుమ కులంల గిట్లనే నడుత్తంది. పెద్దోల్లయ్యేదాకుంచుతె మొగపోరగాండ్లు దొరుకరిగ. మేం పదేండ్లు రాకముందే లగ్గం జేత్తం. నీకు తెలువదా గిది?"

"ఎనుకటి సంగతేమో గని గిప్పుడు గట్లనే సేత్తెట్లనోయి.? గా పసిపోరికేమెరుకని లగ్గం జేసినట్టు?"

"ఇంకీపోరికి నయ్యం. ఏడెనిమిదేండ్లున్నయి. కుర్మ లసుమయ్య బిడ్డెకయితె మూడేండ్లకే లగ్గమాయె. పొల్లకు తలువాలు పొయ్యరాకుంటె తల్లే పోసింది. పొల్ల లగ్గం పొల్లనే[32] నిదువెయింది'

"మంచిగనే సేత్తండ్రు తియ్యలగ్గాలు".

"ఈ పొలనేవూరి కిచ్చిండు?"

"కన్నాగురమే. కుర్మపల్లెకిల్లుంది"

"గొంగల్ల బ్యారెం జేసుకుంట బతుకుతరు"

"గిట్ల పసిపోరగాండ్లకు లగ్గాలు జేత్తె పెద్ద పెరిగినంక ఇట్టం గాకుంటేజేత్తరు?"

"ఏం జేసేదేంది? ఇడుపుగాయిదమైతది. మారుమానం[33] ఇచ్చుడైతది. ఎట్లయిన గనాడిదానికే కట్టం! ఇడిసిపెట్టి నాడిదాన్ని మొదాటి పెండ్లోడు సేసుకోడు. పెండ్లం సచ్చిపోయినోడు గిట్టుంటె ఆనికి పిల్లలున్నా, వయిసెక్కో ఉన్నా ఇచ్చుడైతదిగ" అన్నడు జెగ్గయ్య.

జెగ్గయ్య మాటినంగనే నాకు పదిగేనిరువయేండ్ల ఈడు బేదంతోనున్న కురుమోల్ల జంటలు యాదికచ్చినయి. ఇగ నేనేం మాట్లాడలే. కరీంనగరం పొయ్యేదాక నా మనుసంతెట్లనో ఐంది. ఎన్నో ఆలోచనలచ్చినయి. ఎక్కడెక్కన్నో తిర్గింది నా మనుసు.

నా ఎనుకున్న బాలమత్తయిదువ యాదికత్తె నాకు నలుపయేండ్ల ససంత్రం యాదికచ్చింది. వరుసతప్పకుంట ఓట్లేసుకుంటున్న నాయకులు యాదికచ్చిండ్రు. శారద చట్టం మనుసుల మెదిలింది. సంఘసంస్కర్త వీరేశలింగం పంతులు కండ్లముందు కదిలిండు. గురజాడవారి పూర్ణమ్మ ఎదురుంగున్నట్టనిపించింది. రాజా రామ్మోహనరాయలసొంటి ఎంతోమంది సంస్కర్తలు కండ్లముంగట తిరుగుతన్నట్టనిపించింది. వాళ్ళ కండ్లల్ల నీల్లూరుతున్నట్టనిపించింది నాకు.

ఒక్కకాడ జోగిన్లు, ఇంకోకాడ బాలముత్తయిదువలు, మరోకాడ వెట్టి బతుకుల్లోని మానం-పానం పోగొట్టుకుంటున్నోల్లు, ఇంకోకాడ వరకట్నం పేరుమీద సచ్చెటోల్లు, మరోకాడ కడుపునిండక శరీరమమ్ముకునేటి చెల్లెండ్లు-ఇవ్వన్ని నా మనుసుల మెదిలి, కలపెల కాగింది. కండ్లపొంటి నీల్లచ్చినయి.

★ ★ ★